యాదగిరీశుడికి వైభవంగా దర్బార్ సేవ

తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 24: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి శనివారం దర్బార్ సేవోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి సేవోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శ నారసింహహోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్యకల్యాణ తంతును నిర్వహించారు. పాతగుట్ట స్వామి వారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. శ్రావణమాసం శనివారం కావడంతో స్వామివారి దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 20వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 33,43,605 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

30న ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం

శ్రావణమాసం సందర్భంగా ఈ నెల 30న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. కొండ కింద సత్యనారాయణ వ్రత మండపంలోని హాల్ నంబర్ 2లో ఉదయం 11 గంటలకు వ్రతాలు ప్రారంభమవుతాయన్నారు. వ్రతంలో పాల్గొనే భక్తులు 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ పేర్లను వ్రత మండప కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. వ్రతానికి కావాల్సిన పూజాసామాగ్రి దేవస్థానం సమకూర్చనున్నదని తెలిపారు.

రుణమాఫీ హామీ నెరవేర్చడంలో సీఎం విఫలం

- ఆయనపై కేసు నమోదు చేయాలి
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డిపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు

భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకి ఫిర్యాదు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై ఒట్టేసి ఆగస్టు 15లోగా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి దానిని నెరవేర్చడంలో విఫలమయ్యారని, భక్తుల మనోభావాలు దెబ్బతీసిన సీఎంపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య కోరారు. శనివారం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ రమేశ్‌ను కలిసి సీఎంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2024 ఏప్రిల్ 21న భువనగిరిలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై ఒట్టేసి మరీ రుణమాఫీ చేస్తామని హామీఇచ్చారని తెలిపారు. ఇప్పటి వరకు కేవలం 42 శాతం కంటే ఎక్కువ రుణమాఫీ జరుగలేదన్నారు. స్వామి వారిపై ఒట్టేసి వాగ్దానం చేసి నెరవేర్చక పోవడంతో భక్తుల మనోభావాలు, విశ్వాసం దెబ్బతిన్నాయని తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ఆరాధించే లక్షలాది మంది భక్తుల విశ్వాసాన్ని ప్రభావితం చేసేలా ముఖ్యమంత్రి తీరు ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు బాలయ్య, శ్రీధర్, వాసు, విరేశం, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

భువనగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

భువనగిరి అర్బన్ : రైతుల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి పూర్తి స్థాయిలో మాఫీ చేయక మాటతప్పిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రైతుల రుణాలు మాఫీ కాక వారు నానా అవస్థలు పడుతున్నారని, సాగు పనులు మానేసి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో పార్టీ మండలాధ్యక్షుడు జనగాం పాండు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఖాజా అజీమొద్దీన్, ఇట్టబోయిన గోపాల్, తాడె రాజశేఖర్, వెల్దుర్తి రఘునాథ్, తాడూరి భిక్షపతి, నరేంద్రాచారి, శివ, బబ్లూ, వీరేశ్, లక్ష్మణ్, ఇస్మాయిల్, సురేశ్, శాగంటి నర్సింహ, గుర్రాల శ్రీశైలం, సుభాశ్, పెంట నితీశ్, సూరజ్, అజయ్ పాల్గొన్నారు.

తుర్కపల్లి పోలీసులకు ఫిర్యాదు

తుర్కపల్లి : రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరుతూ శనివారం తుర్కపల్లి పోలీస్‌స్టేషన్లో ఏఎస్ఐ బాలనర్సింహకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బీకునాయక్, బీఆర్ఎస్ మండల సెక్రటరీ జనరల్ శాగర్ల పరమేశ్, మాజీ ఎంపీటీసీలు గిద్దె కర్ణాకర్, పలుగుల నవీన్‌కుమార్, పార్టీ సోషల్‌మీడియా నియోజకవర్గ కన్వీనర్ నల్ల శ్రీకాంత్, మాజీ కోఆప్షన్ సభ్యుడు రహమత్‌షరీఫ్, నాయకులు బూక్యా రవీందర్, పుట్ట సాయిలు, యాదగిరి, ఖలీల్, మల్లేశం, రాంబాబు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డివన్నీ మాయమాటలే

మోటకొండూర్: అబద్ధాలు చెప్పడంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఎవరూ సాటిలేరని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య అన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి, చేయకుండా రైతులను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు స్థానిక ఎస్ఐ పాండుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ, మాజీ ఎంపీటీసీ పన్నాల అంజిరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ బురాన్, బీఆర్ఎస్‌వై గ్రామశాఖ అధ్యక్షుడు బొట్ల మహేశ్, నాయకులు సిరబోయిన నర్సింహులుయాదవ్, బొట్ల శ్రీనివాస్, దడిగే మధు, ప్రశాంత్, వంగపల్లి నరేశ్, కస్పరాజు, భువనగిరి నరసింహ పాల్గొన్నారు.

ఆలేరు పోలీస్‌స్టేషన్లో ..

ఆలేరురూరల్ : రైతురుణమాఫీ విషయంలో మాటతప్పిన సీఎంపై కేసు నమోదు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు శనివారం ఆలేరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాధు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశ్ గౌడ్, నాయకులు జల్లి నర్సింహులు, కుండె సంపత్, పత్తి వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆలేరు ఏఎస్ఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తుర్కపల్లి : ఏఎస్ఐ బాల్‌నర్సింహకు ఫిర్యాదు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మోటకొండూరు : ఎస్ఐ పాండుకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఓటరు జాబితా సవరణపై బీఎల్ఓలకు శిక్షణ

బీబీనగరఖ, ఆగస్టు 24 : ఓటరు జాబితా సవరణపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్ కె. నర్సిరెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితాలో తప్పులు ఉండకుండా చూడాలని, 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఫామ్ 6, 7, 8ను ఎందుకోసం ఉపయోగిస్తారనే విషయమై అవగాహన కల్పించాలన్నారు. ప్రజల దరఖాస్తులు స్వీకరించి ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. మండలస్థాయి మాస్టర్ ట్రైనర్లు రామరాజు, నరేందర్‌రెడ్డి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయల పరామర్శ

మోటకొండూర్, ఆగస్టు 24: మండలంలోని వర్టూర్ గ్రామానికి చెందిన చౌట సత్తయ్య అనారోగ్యం బారిన పడి ఇటీవలే మెదడు శస్త్రచికిత్స చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్ శనివారం సత్తయ్యను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సూదగాని రాందాస్, కాదూరి శ్రీనివాస్, గువ్వ ఎల్లయ్య, పల్లె నరేశ్, మైసయ్య, విఠల్, శ్రీనివాస్, సుదర్శన్ ఉన్నారు.

'రజకుల కోసం రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలి'

భువనగిరి అర్బన్, ఆగస్టు 24: రజకుల కోసం రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వడ్డెబోయిన శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో రజకులు వివక్షకు గురువుతున్నారని, పెత్తందారులు వారిపై దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లాలో రజకులను 8 నెలలుగా బహిష్కరిస్తే రజకులు ఐక్యంగా పోరాడి విజయం సాధించినట్లు పేర్కొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య


లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న బీర్ల ఐలయ్య

ఆలేరురూరల్, ఆగస్టు 24 : అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. నియోజకవర్గంలోని 27 మంది లబ్ధిదారులకు మంజూరైన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు, 96 మంది బాధితులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం ఆలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కానుగు బాల్‌రాజ్‌గౌడ్, కొండ్రాజ్ వెంకటేశ్వర్‌రాజు, ఎంఏ ఏజాజ్, నీలం పద్మా వెంకటస్వామి, ఉట్కూరి సురేశ్‌గౌడ్, ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పైళ్ల శేఖర్‌రెడ్డి పరామర్శ


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవికుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

బీబీనగర్, ఆగస్టు 24 : మండలంలోని రహీంఖాన్‌గూడెం గ్రామ మాజీ సర్పంచ్ మంచాల రవికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి దవాఖానకు వెళ్లి రవికుమార్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రైతుబంధు సమితి మాజీ మండల కోఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డి, నాయకులు కొలను దేవేందర్‌రెడ్డి, పంజాల రామారావుగౌడ్, జక్కి నగేష్, బద్దం శేఖర్‌రెడ్డి, నరేందర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, కాటంగౌడ్ ఉన్నారు.

రైతుల రుణమాఫీ కోసం నిధులు విడుదల చేయాలి

రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి

బీబీనగర్ : రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నాయకులు

బీబీనగర్/ఆత్మకూరు(ఎం), ఆగస్టు 24 : రైతుల రుణమాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.12 వేల కోట్లు విడుదల చేయాలని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీబీనగర్, ఆత్మకూర్ఎం తాసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వరకు రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని, అందుకు రూ. 31 వేల కోట్లు అవసరమని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ మేరకు నిధులు విడుదల చేయలేదన్నారు. రైతుమాఫీ కోసం రైతులు, ప్రతిపక్షాలు రోడ్లెక్కి నిరసన వ్యక్తం చేస్తుంటే వారి మాట వినకుండా కలెక్టర్ ఆఫీస్‌కు వెళ్లాలని ముఖ్యమంత్రి ప్రకటించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెట్టకుండా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గాడి శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, జిల్లా నాయకులు రచ్చ గోవర్ధన్, బండారు శ్రీరాములు, రైతుసంఘం నాయకులు గూడూరు శ్రీకాంత్‌రెడ్డి, గడ్డం వెంకటేశం పాల్గొన్నారు.

సేఫ్టీ మోకులపై కల్లుగీత కార్మికులకు శిక్షణ

గీత కార్మికులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

ఆలేరురూరల్,ఆగస్టు 24 : మండలంలోని కొలనుపాక తాటివనంలో బీసీవెల్ఫేర్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆలేరు, యాదగిరిగుట్ట మండలాల గీతకార్మికులకు శనివారం సేఫ్టీ మోకులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సెఫ్టీ మోకులతో తాటి చెట్టు ఎక్కి దిగే విధానాన్ని కార్మికులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది కిమ్యానాయక్, మంజుల, గౌడసంఘం నాయకులు దూడల బాగయ్య, బైరి పాపరాజు, భిక్షపతి, మిట్టపల్లి పాండు, మాసాపేట రాజు, నల్లవాల సోమలింగం, కుమ్మరిండ్ల అంజయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో మొక్కలు నాటి సంరక్షించాలి : ఎంపీఓ

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 24 : మండలంలోని అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీఓ పద్మావతి సూచించారు. శనివారం మండలంలోని తుక్కాపురం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు సంతోష, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్‌అసిస్టెంట్ సతీశ్ పాల్గొన్నారు.

30 నుంచి రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 24 : ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలోని శుభం గార్డెన్స్‌లో ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్, తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాసుల భానుచందర్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో జూనియర్స్, సీనియర్స్(స్త్రీ, పురుషులు) ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ పి. వెంకటరమణ, ఇంటర్నేషనల్ ప్లేయర్ చైతన్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, నాయకులు కాసుల అంజయ్య, దయాకర్, నరసింహ పాల్గొన్నారు.

వాసాలమర్రిలో 12 అడుగుల ఆంజనేయ విగ్రహం

భువనగిరి అర్బన్, ఆగస్టు 24: తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి చెందిన పలుగుల శ్రీనివాస్ కుటుంబ సభ్యుల సహకారంతో భువనగిరి పట్టణంలోని అంజనాద్రినగర్‌లోని ఆంజనేయస్వామి దేవలయంలో 12 అడుగుల ఏకశిల భక్తాంజనేయ విగ్రహప్రతిష్ఠ శనివారం నిర్వహించారు. ఈ విగ్రహాన్ని ఒకేసారి 100 మంది భక్తులు దర్శించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాయ దశరథ, 13 వార్డు కౌన్సిలర్ జనగాం కవితానర్సింహచారి, నాయకులు మన్నె వెంకటయ్య, రాంచంద్రారెడ్డి, అంజిరెడ్డి, గౌరీశంకర్, యాదగిరి పాల్గొన్నారు.

నర్సింహ మృతికి సంతాపం

రామన్నపేట, ఆగస్టు 24: బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు కూనూరు ముత్తయ్య తండ్రి కూనూరు నర్సింహ శుక్రవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు శనివారం ఆయన ఇంటికి వెళ్లి నర్సింహ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, మార్కెట్‌కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, గ్రామశాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కూనూరు శ్రీనివాస్, దాసరి శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కంకల హరీశ్, మల్ల అశోక్, సైదులు, మల్లేశం, రమేశ్, శ్రీను ఉన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలని వినతి

రామన్నపేట, ఆగస్టు 24: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ ధర్మ సమాజ్‌పార్టీ నాయకులు శనివారం తాసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు ఒకేదఫాలో రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చి ఇప్పుడు మార్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, ప్రధానకార్యదర్శి గోవర్ధన్, కోశాధికారి నరేందర్, స్వామి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

భువనగిరి అర్బన్, ఆగస్టు 24: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. అర్హులైన వారందరికీ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణాధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, వెంకటేశ్, నాయకులు వనం కృష్ణ, తంగళ్లపల్లి రవికుమార్, మజర్, ఆవేజ్‌చిస్తి, లయీఖ్‌అహ్మద్ పాల్గొన్నారు.

రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

భువనగిరికలెక్టరేట్, ఆగస్టు 24 : రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి ప్రజలకు మేలు చేసేందుకు కొత్త రెవెన్యూ విధానం తేవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ చింతపండు నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న) అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు 2024 ముసాయిదాపై రైతులు, అడ్వకేట్లు, వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులతో నిర్వహించిన చర్చావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ హనుమంత్ కె.జెండగే మాట్లాడుతూ భూమి విషయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా, వారికి మేలు జరిగేలా కొత్త రెవెన్యూ యాక్ట్‌పై సూచనలు, సలహాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ తాసీల్దార్ ఉదయ్‌కుమార్, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణగౌడ్, ఏశాల అశోక్ తమ అభిప్రాయాలను వెల్లడించారు. జిల్లా అదనపు కలెక్టర్లు పి. బెన్‌షాలోమ్, కలెక్టర్ కె. గంగాధర్, ఆర్డీఓలు అమరేందర్, శేఖర్‌రెడ్డి కొత్త చట్టంలో పొందుపర్చిన అంశాలను వివరించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా సాధికారిత బృందం సభ్యురాలు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 24 : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా మహిళా సాధికారిత బృందం సభ్యులు సూచించారు. వందరోజుల సంకల్ప కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని జూలూరు 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, చట్టాలపై, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారిత. కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ హర్ష, సభ్యులు నికిత, మనీష, భార్గవి, అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, పద్మ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

సర్టిఫికెట్లు అందుకున్న ఎన్‌సీసీ కెడేట్లు

ఆలేరురూరల్, ఆగస్టు 24 : ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఎన్‌సీసీ వార్షిక శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్‌లోని 10 బెటాలియన్ కమాండింగ్ అధికారి కర్నల్ఎస్. సెంథిల్ రామదురై ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రయాణికురాలి బ్యాగు నుంచి రూ.30 వేలు చోరీ

భువనగిరి అర్బన్, ఆగస్టు 24: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులోంచి గుర్తు తెలియని వ్యక్తులు నగదును దొంగిలించిన ఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన వంగ వసంత భువనగిరి నుంచి జనగాం వెళ్లేందుకు భువనగిరికి వచ్చింది. భువనగిరి బస్టాండ్‌లో బస్సు ఎక్కే ముందు బ్యాగులో చూసుకోగా అందులో ఉండాల్సిన రూ.30 వేలు కనిపించలేదు. దాంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్

ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, ఆగస్టు 24: మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులు, డ్రైనేజీ నిర్